
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 24 వ భాగం

## హిరణ్యకశిపుడు, నృసింహావతారం – 1

ఇప్పటివరకూ కొడుకూ, తండ్రీ శ్రీహరి ఉన్నాడు, లేడని వాదించుకోవడం, చావు దగ్గిరపడిన హిరణ్యకశిపుడు రెచ్చిపోతూండడం చూసాం. ఇంక ఇప్పుడు అమీ తుమీ తేల్చుకునే సమయం వచ్చింది. ఎక్కడా చూపించు అంటే ప్రహ్లాదుడు ఎక్కడైనా సరే అంటున్నాడు కనక బయటకి రావడానికి శ్రీహరి సిద్ధంగా ఉన్నాడు కూడా. దాదాపు గజేంద్రమోక్షం లాంటి ఘట్టమే ఇదీను. అక్కడ భక్తితో పిలిస్తే పరుగెట్టుకుంటూ వచ్చినాయన ఇక్కడ కోపంతో ఎప్పుడు ఎక్కడ్నుంచి రమ్మంటే అక్కడ్నుంచి రావడానికి సిద్ధంగా ఉన్నాడు.

క. డింభక సర్వస్థలముల
నంభోరుహనేత్రుఁ డుండు ననుచు మిగుల సం
రంభంబునఁ బలికెద వీ
స్తంభంబునఁ జూపఁ గలవె చక్రిన్ గ్రిక్రిన్. [7-279]

హిరణ్యకశిపుడు ఇప్పుడు చూపించమని అడుగుతున్నాడు – చక్రీ గ్రిక్రీ అని పేల్తున్నావు కదా? ఎక్కడపడితే అక్కడ ఉన్నాడంటున్నావు కదా అంబోరుహ నేత్రుడు? వాణ్ణే చూపించు ఈ స్థంభంలో అంటున్నాడు. ప్రహ్లాదుడు ఎటువంటి నమ్మకం ఉన్నవాడో కింద పద్యం లో చెప్తున్నాడు.

శా. అంభోజాసనుఁ డాదిగాఁగ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండు ప్రోడ విపులస్తంభంబునం దుండడే?
స్తంభాంతర్గతుఁ డయ్యు నుండుటకు నే సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానఁబడు బ్రత్యక్షస్వరూపంబునన్. [7-282]

బ్రహ్మదేవుడ్నించి గడ్డిపరక దాకా విశ్వవ్యాప్తమైన శ్రీహరి ఇంత పెద్ద స్థంభంలో ఉండడా? తప్పకుండా ఉండి తీరుతాడు. ఉండడమే కాదు ఇప్పుడు నువ్వు నీ దర్పం, దంభం వదుల్చుకుని చూస్తే ప్రత్యక్షం గా కనిపిస్తాడు కూడా.

పరమహంస యోగానందగారు చెప్పిన ఓ చిన్న కథ చెప్పుకుని ముందుకి కదులుదాం. ఓ ఊర్లో ఒక మునీ, ఓ గృహస్థూ, ఓ తాగుబోతూ ఉండేవారు. ముని దొరికినదేదో తిని ధ్యానం, గృహస్థు తన కష్టాలు తాను పడుతూ ఉంటే తాగుబోతు మాత్రం రోజు తాగి ఊళ్ళోవాళ్ళమీద ఎగరడం ఏదో పేల్తూ ఉండడం చేస్తూ ఉండేవాడు. ఓ రోజు నారదుడు ఆ ఊర్లోంచి వెళ్తూ ఈ ముగ్గుర్నీ కలవడం తటస్థించింది. నారదుడు ఎప్పుడూ మహా విష్ణువుని తల్చుకుంటూ ఆయన్ని చూస్తూ ఉంటాడు కదా అని మునీ, గృహస్థూ "భగవంతుడు మాకెప్పుడు కనిపిస్తాడో కాస్త కనుక్కుంటారా?" అని అడిగారు. సరే అని వెళ్తూంటే దారిలో తాగుబోతు కూడా అదే అడిగాడుట నారదుణ్ణి. నారదుడు విసుక్కుంటూ సరే అని వీళ్ళని వదిలి వైకుంఠం చేరాక అడిగాడుట విష్ణువుని – మునీ, గృహస్థూ అడిగారు బానే ఉంది, కానీ తాగుబోతుక్కూడా మీరెప్పుడు కనిపిస్తారో చెప్పండి అని. "ఇప్పుడు నేను సూది బెజ్జంలోంచి ఏనుగుని ఎక్కించడానికి ప్రయత్నం చేస్తున్నాను. అది అయిపోగానే వచ్చి కనిపిస్తానని చెప్పు" అని నారదుడికి సమాధానం చెప్పేట్ట విష్ణువు.

వెనక్కి వచ్చి మునితో చెప్పేట్ట నారదుడు – "ఇదిగో ఇలా సూది బెజ్జంలోంచి ఏనుగుని ఎక్కించడానికి ప్రయత్నం చేస్తున్నాడు విష్ణువు. అది అయిపోగానే వచ్చి కనిపిస్తానని చెప్పమన్నాడు" అని. ముని వెంఠనే లేచి "ఏమిటండీ, ఎంత బుర్రలేనివాడైనా సూది బెజ్జంలోంచి ఏనుగు ని దూర్చగలడా? అదెప్పుడౌతుంది? కనిపించను అని చెప్పకుండా ఇలా అడ్డదారిలో చెప్పడం దేనికీ? ఈ జపం తపం అంతా వృధా అన్న మాట" అని లేచిపోయేట్ట. గృహస్థు కూడా ఇలాగే మాట్లాడేక తప్పదురా భగవంతుడా అనుకుంటూ తాగుబోతు దగ్గిర్నుంచి వచ్చే వాసనకి ముక్కు మూసుకుని వాడితో కూడా ఇలాగే సూది బెజ్జం, ఏనుగు గురించి చెప్పేట్ట నారదుడు, ఆ పని అయిపోగానే వస్తాడు నిన్ను చూడ్డానికీ అని. ఈ మాట వినగానే తాగుబోతు, "భగవంతుడంటే ఏపనైనా చేయగలడు కదా, సూది బెజ్జంలోంచి ఏనుగుని దూర్చడం ఆయనకి ఓ పెద్ద పనేనా? అంటే ఈ పాటికి వచ్చేస్తూ ఉండొచ్చు. నేను ఎంత తాగుబోతునైనా నన్ను చూడ్డానికి అంత త్వరగా వస్తున్నాడన్న మాట" అని అక్కడికక్కడే జపం చేస్తూ సంతోషంగా నాట్యం చేయడం మొదలు పెట్టేట్ట. ఆ నమ్మకానికి నారదుడు విస్తుపోయి చూస్తూంటే విష్ణువొచ్చి తాగుబోతుకి దర్శనం ఇచ్చాడుట. అంటే ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే – అందర్నీ తాగుబోతులుగా మారమని కాదు – భగవంతుడంటే అంత నమ్మకం ఉండాలి. అప్పుడు ఆయన్ని చూడ్డానికి మనకి అర్హత ఉంది. దీన్నే అచంచలమైన భక్తి విశ్వాసాలు ఉండడం అంటారు. ప్రహ్లాదుడి భక్తీ, నమ్మకం ఇటువంటివే.

మ. వినరా డింభక! మూఢచిత్త! గరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద; వైన నిందుఁ గలఁడే యంచున్ మదోద్రేకియై
దనుజేంద్రుం డరచేత వ్రేసెను మహోదగ్రప్రభాశుంభమున్
జనదృగ్భీషణదంభమున్ హరిజను స్సంరంభమున్ స్తంభమున్. [7-284]

ఇలా చెప్పేసరికి హిరణ్యకశిపుడికి కోపం తారాస్థాయిలోకి ఎక్కి "ఒరే బుద్ధిలేనివాడా, విను ఈ స్థంభాన్ని కొడుతున్నాను వచ్చి కనిపిస్తాడేమో" అంటూ శ్రీహరి బయటకి రావడానికి కారణమైన స్థంభాన్ని(హరిజను స్సంరంభమున్ స్తంభమున్) చేత్తో కొట్టాడు. ఇక్కడ నృసింహావతారాన్ని వర్ణించడానికి పోతనకి ఎన్ని రోజులు పట్టిందో చెప్పలేం కానీ ఈ వచనం మాత్రం నభూతో నభవిష్యతి. నాలుక తడబడకుండా చదవడానికి ప్రయత్నం చేయండి.

వ. ఇట్లు దానవేంద్రుండు పరిగృహ్యమాణ వైరుండును, వైరానుబంధ జాజ్వల్యమాన రోషానలుండును, రోషానలజంఘన్యమాన విజ్ఞాన వినయుండును, వినయగాంభీర్యధైర్య జేగీయమాన హృదయుండును హృదయ చాంచల్యమాన తామసుండును, తామస గుణచంక్రమ్యమాణస్థైర్యుండును నై విస్రంభంబున హుంకరించి బాలుని ధిక్కరించి హరి నిందుఁ జూపు మని కనత్కనకమణిమయకంకణక్రేంకార శబ్దపూర్వకంబుగా దిగ్దంతిదంత భేదన పాటవ ప్రశస్తం బగు హస్తంబున సభామండప స్తంభంబు వ్రేసిన వ్రేటుతోడన దశదిశలను మిడుంగుఱులు చెదరం జిటిలి పెటిలిపడి బంభజ్యమానం బగు నమ్మహాస్తంభంబువలనఁ బ్రళయవేళాసంభూత సప్తస్కంధబంధుర సమీరణ సంఘటిత ఘోరరజోఘుష్యమాణ మహావలాహకవర్గనిర్గత నిబిడనిష్ఠురదుస్సహ నిర్ఘాతసంఘ నిర్ఘోషనికాశంబు లయిన ఛటచ్ఛట స్ఫుటస్ఫుటధ్వని ప్రముఖ భయంకరారావపుంజంబులు జంజన్యమానంబులై యెగసి యాకాశకుహరాంతరాళంబు నిరవకాశంబుజేసి నిండినం బట్టుచాలక దోధూయమానహృదయంబులయి పరవశంబులైన పితామహ మహేంద్ర వరుణ వాయు శిఖిముఖర చరాచర జంతుజాలంబులతోడ బ్రహ్మాండకటాహంబు పగిలి పరిస్ఫోటితంబుగాఁ బ్రఫుల్లపద్మయుగళ సంకాశభాస్వర చక్ర చాప హల కులిశ జలచర రేఖాంకిత చారు చరణతలుండును, చరణచంక్రమణ ఘనవినమిత విశ్వంభరాభార ధౌరేయదిక్కుంభి కుంభీనస కుంభి నీధర కూర్మకులశేఖరుండును, దుగ్ధజలధిజాత శుండాల శుండాదండమండిత ప్రకాండ ప్రచండ మహోరుస్తంభ యుగళుండును, ఘణఘణాయమాన మణికింకిణీగణముఖరిత మేఖలావలయవ లయిత పీతాంబరశోభితకటిప్రదేశుండును, నిర్జరనిమ్నగావర్తవర్తుల కమలాకరగంభీర నాభివివరుండును, ముష్టిపరిమేయవినుత తనుతరస్నిగ్ధ మధ్యుండును, కులాచల సానుభాగ సదృశ కర్కశవిశాలవక్షుండును, దుర్జనదనుజభట ధైర్యలతికాలవిత్రాయమాణ రక్షోరాజ వక్షోభాగ విశంకటక్షేత్ర విలేఖనచంగలాంగలాయమాన ప్రతాపజ్వలజ్వాలాయమాన శరణాగతనయనచకోరచంద్రరేఖాయమాణ వజ్రా యుధ ప్రతిమాన భాసమాన నిశాతనఖరతర ముఖనఖరుండును, శంఖ చక్ర గదా ఖడ్గ కుంత తోమర ప్రముఖ నానాయుధ మహిత మహోత్తుంగ మహీధరశృంగసన్నిభ వీరసాగరవేలాయమాన మాలికావిరాజమాన నిరర్గళానేకశత భుజార్గళుండును, మంజు మంజీర మణిపుంజ రంజిత మంజుల హార కేయూర కంకణ కిరీట మకర కుండలాది భూషణభూషితుండును, త్రివళీయుత శిఖరిశిఖరాభపరిణద్ధ బంధురకంధరుండును, ప్రకంపనకంపిత పారిజాతపాదపల్లవ ప్రతీకాశ కోపావేశ సంచలితాధరుండును, శరత్కాల మేఘజాలమధ్య ధగద్ధగాయమాన తటిల్లతాసమాన దేదీప్యమాన దంష్ట్రాంకురుండును, కల్పాంతకాల సకలభువనగ్రసన విజృంభమాణ సప్తజిహ్వ జిహ్వాతులిత తరళతరాయమాణ విభ్రాజమానజిహ్వుండును, మేరు మందర మహాగుహాంతరాళవిస్తార విపుల వక్త్రనాసికారంధ్రుండును, నాసికారంధ్ర నిస్సరన్నిబిడనిశ్వాసనికర సంఘట్టన సంక్షోభిత సంతప్యమాన సప్త సాగరుండును, పూర్వ పర్వత విద్యోతమాన ఖద్యోత మండలసదృక్ష సమంచిత లోచనుండును, లోచనాంచలసముత్కీర్యమాణ విలోలకీలాభీల విస్ఫులింగ వితానరోరుధ్యమాన తారకా గ్రహమండలుండును, శక్రచాప సురుచిరాదభ్ర మహాభ్రూలతా బంధ బంధురభయంకర వదనుండును, ఘనతర గండశైలతుల్య కమనీ యగండభాగుండును, సంధ్యారాగ రక్తధారాధర మాలికాప్రతిమ మహాభ్రంకష తంతన్యమాన పటుతర సటాజాలుండును సటాజాల సంచాలసంజాత వాత డోలాయమాన వైమానిక విమానుండును, నిష్కంపిత శంఖవర్ణమహోర్ధ్వ కర్ణుండును, మంథదండాయమాన మందరవసుంధరాధర పరిభ్రమణవేగ సముత్పద్యమాన వియన్మండలమండిత సుధారాశికల్లోల శీకారాకారభాసుర కేసరుండును, పర్వాఖర్వశిశిరకిరణ మయూఖ గౌర తనూరుహుండును నిజ గర్జా నినద నిర్దళిత కుముద సుప్రతీక వామ నైరావణ సార్వభౌమ ప్రముఖ దిగిభరాజ కర్ణ కోటరుండును, ధవళధరాధరదీర్ఘ దురవలోకనీయ దేహుండును, దేహప్రభాపటల నిర్మథ్యమాన పరిపంథి యాతుధాన నికురంబ గర్వాంధకారుండును, బ్రహ్లాద హిరణ్యకశి పురంజన భంజన నిమిత్తాంతరంగ బహిరంగ జేగీయమాన కరుణావీరరస సంయుతుండును, మహాప్రభావుండునునయిన శ్రీనృసింహదేవుండావిర్భవించినం, గనుంగొని. [7-285]

చూసారు కదా తెలుగంటే? ఇది చదివాక తెలుగు వచ్చినవాళ్ళందరూ చేతులెత్తండి అంటే ఎంతమంది ఎత్తుతారో ఊహించడం అంత కష్టం కాదు కదా? స్కూల్లో పిల్లలు తెలుగు వదిలేసి సంస్కృతం, ఫ్రెంచ్ లాంటి బాషలు తీసుకుంటారు బాగా మార్కులొస్తాయనో మరోటో కారణం చేత. ఎందుకంటే తెలుగు నాకెలాగా వచ్చనే చులకన భావన. సంస్కృతం ప్రశ్నలకి తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ సమాధానాలు రాయొచ్చు పరీక్షల్లో. రాస్తారు కూడాను. సంస్కృతం అభివృద్ధికి మేమెంతో దోహదం చేసాం అనుకుంటూ పిల్లలకి ఎక్కువ మార్కులేసి పాస్ చేస్తారు మేష్టర్లు. ఈ పిల్లలకి తెలుగూ సరిగ్గా రాదు, సంస్కృతం సరిగ్గా రాదు. ఏమైనా అడిగితే "మేం పుస్తకాలు చదవం" అని గొప్పగా చెప్తూ ఉంటారు; అక్కడికి పుస్తకాలు చదవటం ఏదో నేరం అయినట్టు. మరి మన తెలుగో? తెలుగెవడిక్కావాలోయ్ చవటాయ్ అంటారు. నాకు తెల్సినంతలో ఈ పై వచనానికి అర్థం చెప్పగల్గిన తెలుగు కుర్రాడు ఎందులోనైనా సరే మహా మేధావి అయ్యి తీరుతాడు. ఈ వచనంలో మూడేళ్ళకి సరిపడా పరిశోధనకి కావాల్సిన విశేషమైన సరుకు ఉంది. ఇలాంటివి పోతన భాగవతంలో ప్రతీ స్కంధంలోనూ కావాల్సినన్ని ఉన్నాయి – చదివేవాడికి తీరికా, కోరికా, ఓపికా ఉంటే. మొత్తం వచనం దాకా ఎందుగ్గానీ – ఈ చిన్న ముక్కకి అర్థం చెప్పడం వస్తే చాలు – "మంథ దండాయమాన మందర వసుంధరాధర పరిభ్రమణవేగ సముత్పద్యమాన వియన్మండలమండిత సుధారాశి కల్లోల శీకారాకారభాసుర కేసరుండును".

[మంథదండాయమాన = కవ్వపుకర్రగానైన; మందర = మందర యనెడి; వసుంధరాధర = పర్వతము {వసుంధరాదరము – వసుంధర (భూమిని) ధర (ధరించెడిది), పర్వతము}; పరిభ్రమణ = తిరిగెడి; వేగ = వేగమువలన, వడివలన; సముత్పద్యమాన = ఎక్కువగాపుట్టుచున్న; వియన్మండల = ఆకాశమున; మండిత = అలంకరింపబడిన; సుధారాశి = పాలసముద్రపు; కల్లోల = తరంగములయొక్క; శీకార = తుంపురుల; ఆకార = వలె; భాసుర = ప్రకాశించుచున్న; కేసరుండును = వెంట్రుకలుగలవాడు;]

ఇది చదివాక ఇంకా పోతన సాక్షాత్తు సరస్వతీ పుత్రుడు కాదనే వాళ్ళెవరైనా ఉంటారా? ఎంతటి సహజ కవినైనా ఇలాంటి వచనం రాయమనండి చూద్దాం? త్యాగరాజు పంచరత్న కృతులు రాసినా పోతన మహాభాగవతం రాసినా అటువంటి పలుకులు రావాలంటే భగవత్కృప ఉండితీరాలి. ఏవో ఒకటి రాసేసి నాకు ఫలానా పురస్కారం రాలేదే అనుకుంటే ఎలా? పురస్కారం దృష్టిలో పెట్టుకుని రాయడం వేరూ, "పలికించెడు వాడు రామభద్రుండట" అనుకుని రాయడం వేరూను. అందుకే రాజుగారు బంగారు నాణేలు పంపితే త్యాగరాజు వద్దని చెప్పి, "నిధి చాల సుఖమా ..." అన్నాడు. పోతన కూడా ఎటువంటి పరిస్థితిల్లోనైనా సరే "కాటుక కంటినీరు ..." అంటూ మొత్తం భాగవతాన్ని, తనను రాయమని ప్రేరేపించిన భగంతుడికే అంకితం ఇచ్చాడు తప్ప, ఒక్కసారి కలలో కూడా ఎవరి దగ్గిర్నుంచీ ఏమీ ఆశించలేదు. "నేను రాస్తున్నాను" అనేది మనసులోంచి పోగొట్టుకున్నాడు కనకనే పోతన అంతటి మహాకావ్యం అలవోకగా రాయగలిగేడు కదా? (ఇక్కడ భాగవతం అంతా పోతన రాయలేదూ మిగతావాళ్ళున్నారూ అనే చర్చ లేవదీయవద్దు దయచేసి. ఎంతమంది రాసినా తెలుగు భాగవతాన్ని "పోతన భాగవతం" అంటున్నాము కదా?)

ఇప్పుడు ఈ వచనం అర్థం చూద్దాం. ఇంతటి తామసుడూ స్థంభాన్ని ఎటువంటి చేత్తో కొట్టేడు? "కనత్కనక మణిమయ కంకణ క్రేంకార శబ్దపూర్వకంబుగా దిగ్దంతిదంత భేదన పాటవ ప్రశస్తం బగు హస్తంబున" కొట్టాడు. అప్పుడు శ్రీహరి బయటకొచ్చాడు. వచ్చినాయన ఎలా ఉన్నాడు? "ఘణఘణాయమాన మణికింకిణీగణ ముఖరిత మేఖలావలయ వలయిత పీతాంబర శోభితకటి ప్రదేశుండును, దుర్జనదనుజభట ధైర్యలతికాలవిత్రాయమాణ రక్షోరాజ వక్షోభాగ విశంకటక్షేత్ర విలేఖనచంగలాంగలాయమాన ప్రతాపజ్వల జ్వాలాయమాన

శరణాగత నయనచకోర చంద్రరేఖాయమాణ వజ్రాయుధ ప్రతిమాన భాసమాన నిశాతనఖరతర ముఖనఖరుండును." గోళ్ళు వజ్రాయుధాల్లా ఉన్నాయిట. ఎందుకంటే రాక్షసరాజు వక్షాన్ని చీల్చడానికి. కూడా ఆయుధాలు ఉన్నాయి – రాజు గార్ని చంపేక వాళ్ళ అనయాయులు తిరగబడితే వాళ్ళని అణచడానికి – "శంఖ చక్ర గదా ఖడ్గ కుంత తోమర ప్రముఖ నానాయుధ మహిత మహోత్తుంగ మహీధరశృంగసన్నిభ వీరసాగరవేలాయమాన మాలికావిరాజమాన నిరర్గళానేకశత భుజార్గళుండును." ఆ వచ్చినవాడి ప్రకాశం ఎలా ఉంది? – "శరత్కాల మేఘజాలమధ్య ధగద్ధగాయమాన తటిల్లతాసమాన దేదీప్యమాన దంష్ట్రాంకురుండును." దట్టమైన నల్లటి మబ్బుల్లోంచి వచ్చే దేదీప్యమాన దంష్ట్రాంకురుండును. భగవద్గీతలో విశ్వరూపం చూసి సంజయుడు ధృతరాష్ట్రుడితో అంటాడు తాను చూసిన దాన్ని పోలుస్తూ – "దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా .." అని. ఆకాశంలో వేయి సూర్యుళ్ళు ఒకేసారి ఉదయిస్తే ఎలా ఉందో అది ఈ విశ్వరూపానికి "కొంచెం" గా సరిపోతుంది అని. పూర్తిగా కాదు – కొంచెంగా మాత్రమే. ఎందుకంటే భగవంతుడు అవ్యక్తుడు అని చెప్పుకున్నాం. పెద్ద పెద్ద ఉత్సవాల్లో బాణసంచా కాలుస్తారు గంటల తరబడి. అది అయిపోయాక ఎలా ఉంది చెప్పమంటే? కళ్లతో చూడాలి తప్ప వర్ణించడం అసాధ్యం కదా?

సరే, ఇంక స్థంభం ఎలా పగిలింది? "... ఛటచ్ఛట స్ఫుటస్ఫుటధ్వని ప్రముఖ భయంకరారావపుంజంబులు జంజన్యమానంబులై యెగసి యాకాశకుహరాంతరాళంబు నిరవకాశంబుజేసి నిండినం బట్టుచాలక దోధూయమాన హృదయంబులయి పరవశంబులైన పితామహ మహేంద్ర వరుణ వాయు శిఖిముఖర చరాచర జంతుజాలంబులతోడ బ్రహ్మాండకటాహంబు పగిలి పరిస్ఫోటితంబుగా." నారాయణీయం రాస్తూ ఉంటే భట్టాత్తిరి గారికి కరుణామయుడైన భగవంతుడు, భక్తపాలన కళాసంరంభుడైన శ్రీహరి ఇంతటి కోపంతో నృసింహావతారం ఎలా ఎత్తాడా అని సందేహం వచ్చేదిట. అప్పుడు గురువాయూరప్పన్ గుడిలోకి వెళ్ళి అడిగితే ఆ రూపం కనిపించేదిట. అది చూసాక వచ్చి మళ్ళీ రచన సాగించేవారు అంటారు. ఇలాంటి రచన చేయాలంటే మనోదృష్టి సరిపోదు – నిజంగా భగవత్కృప ఉండి తీరాలి. ఈ వచనంలో నృసింహావతారాన్ని పోతన పాదాలతో మొదలుపెట్టి తల దాకా, స్తోత్రం చేస్తున్నట్టూ ఎలా వర్ణించాడో గమనించారా?

మనకి భగవంతుడిమీద ఎంత శతృత్వం ఉంటే ఆయన రూపం, నవ్వూ అంత భీకరంగా కనిపిస్తూ ఉంటాయి. దీన్నే నారాయణీయం "త్వద్రూప మాశ్చర్యతో ప్యాశ్చర్యం" అంటోంది. ఇప్పుడు ఈ ఆశ్చర్యమైన రూపం చూసి హిరణ్యకశిపుడు ఇలా అనుకున్నాడు.

క. నరమూర్తిగాదు కేవల
హరిమూర్తియుఁ గాదు మానవాకారముఁ గే
సరియాకారము నున్నది
హరిమాయారచిత మగు యథార్థము చూడన్. [7-286]

ఇది నర మూర్తీ కాదు, హరి (సింహం) మూర్తీ కాదు (నిజంగా హరి కాదా?) మనిషిలాగా ఉన్నాడు సింహంలాగా ఉన్నాడు. ఎవరైతే లేదని ఇన్నాళ్ళూ అనుకున్నానో ఆ శ్రీహరే ఈ మాయా రూపంలో వచ్చాడన్న మాట.

ఉ. తెంపున బాలుఁ డాడినను, ధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి యిందు నరసింహశరీరముఁ దాల్చి చక్రి శి
క్షింపఁగ వచ్చినాఁడు; హరిచే మృతి యంచుఁ దలంతు నైన నా
సొంపును బెంపు నందఱును జూడఁ జరింతు హరింతు శత్రువున్. [7-287]

ప్రహ్లాదుడు నమ్మకంగా చెప్పిన మాటమీద ఇలా వచ్చాడన్న మాట నన్ను చంపడానికి. సరే, అయితే పోయేటప్పుడు యుద్ధం చేసి మరీ ఛస్తాను అనుకున్నాడు.

వ. అని మెత్తంబడని చిత్తంబున గద యెత్తికొని తత్తఱంబున నార్చుచు నకుంఠిత కంఠీరవంబు డగ్గఱు గంధసింధురంబు చందంబున నక్తంచరకుంజరుండు నరసింహదేవున కెదురునడచి తదీయ దివ్యతేజోజాల సన్నికర్షంబునం జేసి దవానలంబు డగ్గఱిన ఖద్యోతంబునుం బోలెఁ గర్తవ్యాకర్తవ్యంబులు దెలియక నిర్గతప్రభుండయి యుండె; అప్పుడు

[7-288]

ఇంక తన మృత్యువు దగ్గిరపడిందని తెలుసు కనక వెంఠనే గద తీసుకుని యుద్ధం సాగించాడు. ఈ యుద్ధం ఎందుకంటే వీరమరణం కోసం – పిరికివాడిలా చావడానికికాదు. అప్పుడు శ్రీహరిని ఎదుర్కొనే "నక్తంచర కుంజరుండు" ఎలా ఉన్నాడు? కార్చిచ్చు దగ్గరకు చేరిన మిణుగురుపురుగు లాగా ఉన్నాడు (దవానలంబు డగ్గఱిన ఖద్యోతంబునుం బోలె గర్తవ్యాకర్తవ్యంబులు దెలియక నిర్గతప్రభుండయి యుండె).

వచ్చే వ్యాసంలో హిరణ్యకశిపుడి వధా, దాని తర్వాత నృసింహదేవుడి కోపం ఎలా తగ్గిందీ అనేవి చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS